బీఆర్ఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం పట్టణంలో గుప్తా కన్వన్షన్ హాల్‌లో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన మండల బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఈ జనరల్ బాడీ సమావేశానికి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ మాలోతు కవిత, నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, బోదెబోయిన బుచ్చయ్య హాజరవుతున్నారని తెలిపారు. సమావేశానికి ముందు పట్టణంలో ఆంజనేయస్వామి పార్కు నుంచి భారీ మోటర్ సైకిల్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, ఆయా మండలాల కన్వీనర్, కోకన్వీనర్లు, మహిళా నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

24న జిల్లా స్థాయి నవోదయ మోడల్ పరీక్ష

బూర్గంపహాడ్, నవంబర్ 21: 19 ఏళ్లుగా ప్రతి ఏడాది నవోదయలో సీట్లు సాధిస్తున్న సారపాకలోని బ్రిలియంట్ నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 24వ తేదీన జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఒకరోజు ముందు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9866283566, 7675040619ను సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ఉచిత కళ్లజోళ్ల పంపిణీలో ఎమ్మెల్యే తెల్లం

కళ్లజోళ్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

భద్రాచలం, నవంబర్ 21: అంధత్వ నివారణకు స్వచ్ఛంద సంస్థలు, పుష్పగిరి కంటి ఆసుపత్రి నిర్వాహకుల సేవలు అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్‌క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ యూఎస్ఏ, సికింద్రాబాద్ వారి పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాలలో కంటి సమస్యలున్న వారికి ఉచితంగా ఇస్తున్న కంటి అద్దాలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆర్డీవో దామోదరరావు , వై.సూర్యనారాయణ, జగదీష్, రామలింగేశ్వరరావు, భానుప్రసాద్, చైతన్య, బి.వెంకటరెడ్డి, గోళ్ల భూపతిరావు, పి.సీతారామిరెడ్డి, సంజీవరావు, భోగాల శ్రీనివాస రెడ్డి, కామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

26న వాహనాల లక్కీ డ్రా

ఇల్లెందు రూరల్, నవంబర్ 21: సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 26న వాహనాల లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జేకే ఉపరితల గని, ఏరియా హాస్పిటల్‌లో అద్దె వాహనాల ఏర్పాటుకు అక్టోబర్‌లో టెండర్ వేసిన వారి నుంచి డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. టెండర్ వేసిన వారంతా జీఎం కార్యాలయానికి రావాలని కోరారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి

పాల్వంచ, నవంబర్ 21: క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకున్న వైద్య విద్యార్థులు క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. ర్యాగింగ్ పర్యవసానాలపై కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తోటి విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసే, వారి మనోభావాలను కించపరిచే, వారి భవిష్యత్తుపై ప్రభావం చూపే ర్యాగింగ్ మహమ్మారిని కళాశాల ప్రాంగణం నుంచి తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఎందరో అమాయక విద్యార్థులు ర్యాగింగ్ కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని, తమ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా విద్యార్థులంగా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఎస్సై సుమన్, జిల్లా షీ టీమ్ ఎస్సై రమాదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలకు ఆర్థిక సాయం

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలకు ఐటీసీ ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ రూ.60వేలు ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాలలో టాయిలెట్స్ మరమ్మతులు, విద్యుత్ లైట్ల ఏర్పాటు, ఐరన్ టాప్స్, పైపులైన్లు, వాష్‌రూమ్ క్లీనింగ్ పనులకు సంబంధించి ఆ నగదును గురుకులం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సరోజిని, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవికు అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం

పర్ణశాల, నవంబర్ 21: దుమ్ముగూడెం మండల వాడ బలిజ సంఘం అధ్యక్షుడు అర్జున్ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యశాఖ వృత్తివారు ఐక్యంగా ఉండాలని, హక్కుల కోసం ప్రతిఒక్కరూ పోరాడాలని అన్నారు. సున్నంబట్టి గ్రామం గోదావరి నది తీరాన వినూత్నంగా గోదావరి నదిలో పడవపై తమ సంఘ సభ్యులతో జెండా ఆవిష్కరించారు.

ప్రతిభ పరీక్షలతో భయం దూరం

అశ్వారావుపేట, నవంబర్ 21: ప్రతిభ పరీక్షలల్లో తరచూ పాల్గొనడం ద్వారా వార్షిక పరీక్షలపై భయం పోతుందని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) బాధ్యులు వీరాస్వామి, నల్లపు ఏడుకొండలు చెప్పారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం చెకుముకి టాలెంట్ టెస్టులను నిర్వహించారు. విజేతలకు పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ.. టాలెంట్ టెస్టులకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఆంగ్ల మాధ్యమం విభాగంలో అశ్వారావుపేట (బాలుర), మామిళ్లవారిగూడెం పాఠశాలలు ప్రథమ స్థానంలో, తెలుగు మాధ్యమంలో అశ్వారావుపేట (బాలికలు), అచ్యుతాపురం పాఠశాలలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. గురుకుల విభాగంలో ముస్లిం మైనార్టీ మొదటి స్థానం, ఏహెచ్ఎస్ సున్నంబట్టి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో జవహర్ విద్యాలయం ప్రథమ, గుడ్ న్యూస్ ద్వితీయ స్థానం సాధించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులను వేదిక

అశ్వారావుపేట: విజేతలకు పుస్తకాలు ఇస్తున్న జేవీవీ బాధ్యులు

బాధ్యులు వీరాస్వామి, వెంకటేశ్వర్లు, ఎంఈవో ప్రసాదరావు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

పాల్వంచ, నవంబర్ 21: స్థానిక బొల్లోరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో పాల్వంచ స్వాతి స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారు. మొదటి బహుమతి అందుకున్న అభినవ సాయి, జోసహస్ర, జె.ఆదర్శ్‌ను కరస్పాండెంట్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ నీలిమ చౌదరి అభినందించారు.

దమ్మపేట, నవంబర్ 21: జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు స్థానిక సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఫాదర్ సాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు జి.యశ్విత(10వ తరగతి), ఎస్.రీనా(9వ తరగతి), హిమేష్(8వ తరగతి) జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. వారిని ఆయన అభినందించారు.

విద్యార్థులకు అభినందన

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 21: అన్నపురెడ్డిపల్లిలో మూడు రోజులపాటు జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో మండలంలోని ఏహెచ్ఎస్ సున్నంబట్టి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరిని పాఠశాల హెచ్ఎం సుశీల గురువారం అభినందించారు.

టేకులపల్లి, నవంబర్ 21: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని ఎన్.గీత, కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థి బి.ధోని ఎంపికయ్యారు. టేకులపల్లి ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఎంఈవో జగన్ .. గీతను. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందించారు. వారికి బహుమతులను అందజేశారు. కోయగూడెం విద్యార్థి బి.ధోనిని ప్రధానోపాధ్యాయుడు అమర్‌సింగ్ గురువారం అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఆశ్రమ విద్యార్థి ప్రతిభ

దుమ్ముగూడెం, నవంబర్ 21: జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి మండలంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని నారాయణరావుపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి కంగాల రాకేష్ ఆర్ఎస్‌బీవీపీ-2024 ఫోకల్ థీమ్ విభాగంలో సైన్స్, టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అంశంలో మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కుంజా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సర్వేష్ దొర, నాగభూషణం, కోటేశ్వరరావు, బాలాజీ, గైడ్ ఉపాధ్యాయులు సురేష్, రవి, కల్యాణి, డిప్యూటీ వార్డెన్ మల్లం వెంకటేష్, సుభద్ర, శ్యాం, హరిలాల్, కృష్ణ, పీఈటీ వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పినపాక, నవంబర్ 21: ఈ నెల 18, 19, 20వ తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ద్వితీయ బహుమతి పొందినట్లుగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాకుమారి తెలిపారు. గురువారం ఆమె పాఠశాలలో మాట్లాడుతూ.. సింధు 10వ తరగతి, గౌతమి 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ థీమ్ నందు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొందినట్లు తెలిపారు.

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

దుమ్ముగూడెం : విజేతలతో జనవిజ్ఞాన వేదిక బాధ్యులు

దుమ్ముగూడెం, నవంబర్ 21: టాలెంట్ టెస్ట్ జనవిజ్ఞాన వేదిక కోఆర్డినేటర్ ఏజే ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లక్ష్మీనగరం ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి పర్ణశాల, రెండవ బహుమతి రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, మూడవ బహుమతి బీసీ గురుకులం విద్యార్థులు గెలుపొందారు. తెలుగుమీడియం విభాగంలో ఎస్ఎన్ఏఎం జడ్పీహెచ్ఎస్ నర్సాపురం మొదటి బహుమతి సాధించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు తహసీల్దార్ అశోక్‌కుమార్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

టాలెంట్ టెస్ట్ విజయవంతం

బూర్గంపహాడ్, నవంబర్ 21: మండలంలోని మోరంపల్లిబంజరలో జరిగిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రయివేటు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల నుంచి 42 మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రతిభకనబర్చారు. పరీక్షలో వివిధ విభాగాల్లో ప్రథమస్థానంలో మోరంపల్లిబంజర్ ఇంగ్లీష్‌మీడియం, తెలుగుమీడియం సారపాక జడ్పీహెచ్ఎస్, బూర్గంపహాడ్ రెసిడెన్షియల్ పాఠశాల, సారపాక ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలు నిలిచాయి. విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వీరభద్రం బహుమతులు పంపిణీ చేశారు.

21ఎంఎన్‌జీ టౌన్04,05: అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎక్స్‌లెంట్ విద్యార్థులు

మణుగూరు టౌన్, నవంబర్ 21: ఇన్‌స్పైర్ అవార్డులు - మనాక్ స్కీం 2023-24 పోటీల్లో ఎక్స్‌లెంట్ పైలెట్ కాలనీ బ్రాంచ్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో అన్నపురెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన కే. ప్రియ హర్షిణి దుర్గ, ఎండీ రిదా ప్రదర్శించిన టెంపరేచర్ కంట్రోల్డ్ బెడ్ కూలర్ నమూనాకు జిల్లా స్థాయి మొదటి బహుమతి లభించింది. వేదికపై కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ వెంకట్, మేఘనతో పాటు కరస్పాండెంట్ ఖాదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21: కొత్తగూడెం 23వ వార్డు కూలీలైన్ ఏడవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, టీచర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పోలీసులకు హెల్త్ క్యాంపు

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ

మణుగూరు టౌన్, నవంబర్ 21: మణుగూరులోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న డీవీ ఫంక్షన్ హాల్‌లో మణుగూరు సబ్ డివిజన్ పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు గురువారం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రత్యేక వైద్య శిబిరంలో మణుగూరు సబ్ డివిజనల్ పోలీసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సీఐ సతీష్‌కుమార్, ఎఐలు మేడా ప్రసాద్, రంజిత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొత్తికోయల సంక్షేమానికి కృషి

టేకులపల్లి, నవంబర్ 21: గొత్తికోయల సంక్షేమానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. మండలంలోని గంగారం పంచాయతీ సిద్ధారం గొత్తికోయల గ్రామంలో బోడు ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వైద్య-ఆరోగ్య శిబిరం ఏర్పాటైంది. ముఖ్య అతిథి చంద్రభాను మాట్లాడుతూ.. ఆదివాసీల సంక్షేమం, ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గొత్తికోయలు మూఢ నమ్మకాలను వదిలి, ఆరోగ్య శాఖ సూచనలు పాటిస్తూ, పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. బాల్య వివాహాలు నేరమని చెప్పారు. అమ్మాయికి 18, , అబ్బాయికి 21 సంవత్సరాలు వచ్చిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని చెప్పారు. ఇద్దరు పిల్లలు కలిగాక కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడ వద్దని, అలాంటి వారికి ఏ రూపంలోనూ సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. సీఐ తాటిపాముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖపై విశ్వసనీయత కలిగించాలి

ఇల్లెందు, నవంబర్ 21: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడం ద్వారా వారిలో పోలీస్ శాఖపై విశ్వసనీయతను పెంచాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. బోడు పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. వర్టికల్స్‌వారీగా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిబ్బందితో చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు నిత్యం పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వసనీయతను పెంచాలని అన్నారు. సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

- ఒక జవాన్‌కు గాయాలు
- 'సీజీ-ఓబీ'లో ఘటన

కొత్తగూడెం క్రైం, నవంబర్ 21 : మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందగా.. ఒక జవాన్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు(సీజీ-ఓబీ)లోని అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం సాయంత్రం నుంచి భద్రతా దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఎరబోరని గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా జినేల్‌గూడా అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగడంతో ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అడవిలోకి పారిపోయారు. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాలపాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో ఒక మావోయిస్టు మృతదేహంతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని ఘటనా స్థలం నుంచి జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎదురు కాల్పుల్లో ఒడిశాకు చెందిన ఒక జవాన్ గాయపడ్డాడు. అతడిని ప్రాథమిక చికిత్స అనంతరం తోటి జవాన్లు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించారు.

వరి విత్తనాలు సిద్ధం

చండ్రుగొండ, నవంబర్ 21: వరి సాగుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని గానుగపాడు సొసైటీ అధ్యక్షుడు చెవుల చందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని యాసంగి, వానాకాలంలో సాగు చేయవచ్చని పేర్కొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 21: వచ్చే నెల 4న ఫరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ ఎన్ఏఎస్-2024 జరగనుంది. ఈ పరీక్ష క్షేత్ర పరిశీలకులుగా ఎంపికైన ఛాత్రోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం స్థానిక మదీనా బీఈడీ కళాశాలలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు ప్రారంభించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అదికారి నాగరాజశేఖర్, ప్రిన్సిపాల్ షాబుద్దీన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహమూద్ పాషా పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 21: పట్టణంలోని భవిత కేంద్రాన్ని జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సైదులు గురువారం సందర్శించారు. అక్కడి పిల్లలతో మాట్లాడారు.

'మాల సింహ గర్జన' పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, నవంబర్ 21: 'హలో మాల-చలో హైదరాబాద్' నినాదంతో డిసెంబర్ 1న జింఖానా మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార వాల్ పోస్టర్‌ను మాలల సంఘం ఇల్లెందు డివిజన్ అధ్యక్షుడు కాలె పుల్లయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఉండేటి బసవయ్య తదితరులు కలిసి గురువారం మండలంలోని సులానగర్ గ్రామ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఉండేటి ప్రసాద్, కర్లపుడి సుందర్‌పాల్, రాసమళ్ల నరసయ్య, కొట్టే సురేష్, కుమ్మరి గురవయ్య, ఉండేటి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అశ్వారావుపేట, నవంబర్ 21: గూడు లేని నిరుపేద గిరిజనులకు తక్షణమే ఇళ్ల స్థలాలుగానీ, ఇందిరమ్మ ఇళ్లుగానీ ఇవ్వాలని సీపీఐ-ఎంఎల్ (మాస్ లైన్) జాతీయ కమిటీ సభ్యుడు కెచ్చల రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రగుంటపల్లి సమీపంలో ఇళ్ల స్థలాల కోసం ఆందోళన చేస్తున్న గిరిజనులను గురువారం కలిసి మద్దతు ప్రకటించారు. వారితో ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారికి సన్మానం

దుమ్ముగూడెం, నవంబర్ 21: దుమ్ముగూడెం పోలీసుస్టేషన్‌లో ఆరేళ్లుగా హెడ్‌కానిస్టేబుల్‌గా, ఏఎస్సైగా సేవలందించి భద్రాచలం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న ఏఎస్సై దాసరి సత్యనారాయణకు దుమ్ముగూడెం సీఐ అశోక్, ఎస్సై గణేష్ సిబ్బందితో కలిసి శాలువాతో సత్కరించారు. అందరి మన్ననలు పొంది అంకితభావంతో పనిచేయాలని సీఐ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శిగా గడ్డం

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం పట్టణంలో గుప్త ఫంక్షన్‌హాల్‌లో సీతారాం ఏచూరినగర్ కుంజా కృష్ణకుమారి ప్రోగ్రాంలో జరిగిన సీపీఎం పట్టణ మహాసభలో పట్టణ కమిటీ కార్యదర్శిగా గడ్డం స్వామి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పాటు 23 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. భద్రాచలాన్ని ఒకే పంచాయతీగా ఉంచి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు తీర్మానించారు. ఈ సభలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన

దుమ్ముగూడెం, నవంబర్ 21: ఐటీసీ ఎంఎస్‌కె, మైరాడ ఎన్‌జీవో ఆధ్వర్యంలో అగ్రి బిజినెస్ సెంటర్ రైతులకు సుస్థిర వ్యవసాయంపై మండల పరిధిలోని మహదేవపురం రైతువేదికలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు కరివేద సాగు చేయడం వల్ల కలిగే ఉపయోగాలు, సీడ్ డ్రిల్లర్, డ్రమ్‌సీడర్ ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సాహితి, మడకం రామారావు, మడకం లక్ష్మి, పూనెం నర్సింహారావు, సవలం శంకర్, కారం జోగయ్య, ఎం.రాజు, ఐటీసీ ఎంఎస్‌కె బాధ్యులు పాల్గొన్నారు.

అటవీ శాఖ డిప్యూటీ కన్జర్వేటర్‌గా బాబు

ఉద్యోగోన్నతి పొందిన బాబు

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 21: జిల్లాలోని కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ డివిజన్ ఎఫ్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న బీ.బాబు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా ఉద్యోగోన్నతి పొందారు. 1988లో డిగ్రీ చదువుతూనే అటవీ శాఖలో ఫారెస్టు గార్డుగా ఉద్యోగం సాధించిన బాబు.. విధి నిర్వహణలో క్రమశిక్షణగా, నిబద్ధతగా ఉంటూ వివిధ ఉద్యోగోన్నతులు పొందుతూవచ్చారు. 2023లో ఖమ్మం డివిజన్ ఎఫ్‌డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2024 నుంచి కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా నియమిస్తూ ఈ నెల 18న ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్